




'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి నెల్లూరు రూరల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమీషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నార. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎ.పి.జె అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో జరిగే స్పందన వేదికలో ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం 'డయల్ యువర్ కమీషనర్' కార్యక్రమంలో భాగంగా ఉదయం 9:30 నుంచి 10:30 వరకు 0861- 2355678 నెంబరుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యాలయంలో కమీషనర్ ను నేరుగా కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



వికాస్ మర్మత్, కమిషనర్

చేతులు కలిశాయి.. మరి మనసులు..

ఆసక్తికరంగా నెల్లూరు నగర రాజకీయం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

వైసిపి నెల్లూరు నగర రాజకీయం ఆసక్తిగా మారింది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న ఎంఎల్ఎ అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కలిపారు. ఈ విషయాన్ని ప్రజాశక్తి ఆదివారం ప్రచురించింది. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కావలి బమిరంగ సభకు వచ్చారు. ఆ సమయంలో అనిల్, రూప్‌ను దగ్గరకు తీసుకుని చేతులో చేయి వేసి కలిపారు. విషయం బటయకు తెలిసినప్పటికీ ఫొటోలు బయటకు రాకుండా సిఎం కార్యాలయం వ్యవహరించింది. ప్రజాశక్తిలో విషయం ప్రచురించినప్పటికీ ఫొటో అందుబాటులోకి రాలేదు. ఆదివారం రూప్, అనిల్, ముఖ్యమంత్రి ఉన్న ఫొటో హల్‌చల్ చేసింది. దానిని చూసినవారంతా రూప్, అనిల్ కలిసిపోయారంటూ ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఇందులో కేవలం చేతులు మాత్రమే కలిశాయని, మనసులు కలవలేదని తెలుస్తోంది. వైసిపి ఏర్పాటు నుంచి రూప్, అనిల్ సఖ్యతగా మెలిగారు. మేయర్ ఎన్నికల తర్వాత వీరిద్దరి మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. అవి కుటుంబ కలహాలా.. వ్యక్తిగత విభేదాలా.. ఆర్థిక లావాదేవిలా.. అనే విషయంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. అనిల్‌తో విభేదించిన రూప్ కుమార్, నెల్లూరు నగరంలో ఆయనకు వ్యతిరేకంగా మరో గ్రూపును తయారు చేశారు. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌తో కలిసి ఆత్మకూరు బస్టాండు వద్ద మరో వైసిపి కార్యాలయాన్ని రూప్ ఏర్పాటు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకుంటున్నారు. ఈ విషయం జిల్లా నాయకత్వంతోపాటు సిఎం దృష్టిలో ఉంది. జిల్లాలోని నాయకులు పలువురు వీరిద్దరి మధ్య సఖ్యత ఏర్పాటు చేయడానికి అనేక ప్రయత్నాలు చేసినా ఫలించనట్లు తెలిసింది. అనిల్‌తో తనకు కుదరదంటూ రూప్ మొహం మీదే పలువురి నేతలకు చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో నెల్లూరు నగరంలో అనిల్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్యవైశ్యుల్లో పట్టు ఉన్న ముక్కాల ద్వారకానాథ్, నగరంలో ఉన్న రూప్‌కుమార్ అనిల్‌కు వ్యతిరేకంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కావలికి వచ్చిన సిఎం వారిద్దరిని దగ్గరకు తీసుకుని చేతులో చేయి వేస కలిపారు. ఇద్దరూ కలిసి పని



చేయాలని, 2024లో అనిల్‌ను గెలిపించాల్సిన బాధ్యత నీదేనంటూ జగన్ రూప్‌తో అన్నట్లు తెలిసింది. ఆక్షణం మగ్గురు నేతలు ముసి ముసి నవ్వులు నవ్వుకుని సిఎం వెళ్లిన వెంటనే ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. కేవలం జగన్ ముఖస్థితి కోసం కొద్దిసేపు ఆప్యాయత నటించిన బాబాయ్.. అబ్బాయ్.. మళ్లీ ఎడమొహం.. పెడ మొహంగానే ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు కొన్ని నెలల నుంచి వీరి మధ్య నెలకొన్న విభేదాలు చక్కపెట్టడానికి ఆ పార్టీ అధిష్టానం ప్రయ త్నించలేదు. కనీసం ఇద్దరిని కూర్చోబెట్టి సమస్యలు ఏమిటి.. గొడవ ఎక్కడ వచ్చిందనే విషయం కూడా చర్చించలేదు. కాకతాలీయంగా ఇద్దరు నేతలు కనిపిస్తే చేతులు కలిపి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్య మంత్రి సయోధ్య ఫలించి 2024 ఎన్నికల్లో రూప్ అనిల్‌కు సహకరిస్తాడో లేదో చూడాలి..

ఉద్యమ కార్యాచరణ సిద్ధం

ప్రజాశక్తి -నెల్లూరు

ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ హాలులో ఎపిజిఇఎ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎపిజిఇఎ రాష్ట్ర సలహా మండలి చైర్మన్ చొప్పా రవీంద్ర బాబు ,రాష్ట్ర కార్యదర్శి గ్రి శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అతిథులుగా, సెక్రెటరియేట్ సభ్యులు అన్ని తాలూకాల అధ్యక్ష కార్యదర్శిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో చొప్పా రవీంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం అన్ని జిల్లాలు పర్యటించి ఉద్యోగుల పక్షాన న్యాయం కోరుతూ రూ పొందించిన ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగుల కోసం నిబద్ధతతో పోరాడే ఏకైక సంఘం ఎపిజిఇఎఅన్నారు. రాష్ట్ర శాఖ నిర్దేశం ప్రకారం ఈ నెల 22వ తేదీ నుంచి జరుగనున్న ఎపిజిఈఎదశలవారీ ఉద్యమ కార్యాచరణ కార్యనిర్వహణ వివరాలను జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు వై రమణారెడ్డి వై మల్లికార్జున లు సభ్యులకు వివరించారు. తదుపరి జిల్లా తాలూకా వారీ కార్యాచరణ షెడ్యూల్, కరపత్రాలను చొప్పా రవీంద్రబాబు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి గారలు ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన ఉద్యోగుల ఆర్థిక ఆర్థికేతర సమస్యలపై ఎపిజిఈఎ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ ఉద్యమాన్ని అన్ని తాలూకాలలోను ఎపిజిఈఎ నాయకులు సమర్థవంతంగా పోరాట స్పూర్తితో నిర్వహించాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మరోసారి అధి కారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మండపం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వ' కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కాల్తీరెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ ఇప్పటికే రా ష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి చరిత్ర సష్టించార ని, మరోమారు ఆ చరిత్ర పున రావతం కానుందని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమం త్రి జగన్మోహన్ రెడ్డి అమలు చే స్తున్న అభివద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల సంతప్తితో వున్న ప్రజలు 2024 ఎన్నికల్లో మళ్ళీ అధికారం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసిపి నాయకులు, కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత ఉన్నారు.



వైసిపి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులుగా సుధీర్


ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :వైసిపి రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులుగా నెల్లూరు రూరల్‌కు చెందిన ఎం సుధీర్‌ను ఆ పార్టీ నియమిం చింది. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. నెల్లూరు రూరల్ నుంచి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మొన్నటి వరకూ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులుగా కొనసా గారు. ఆయన పార్టీ నుంచి వెళ్లిపోవడంతో ఆ స్థానానికి సుధీర్‌ను ఎంపిక చేశారు.



ముఖ్యమంత్రితో సుధీర్

విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి -పొదలకూరు : పొదలకూరు ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లా , రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన పొదలకూరుకి చెందిన అచ్చి వైష్ణవిని మండల విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకోవాలని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊకోటి లక్ష్మీనారాయణ అన్నారు.ఆదివారం పట్టణము తొగటవీధిలోని అచ్చి శ్రీనివాసులు కుమార్తె అచ్చి వైష్ణవి నివాసానికి వెళ్లి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చదువుల తల్లి వైష్ణవిని సన్మానించారు. పట్టణంలోని డీఎన్ ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన వైష్ణవి, 600 మార్కులకు 592 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా పొదలకూరు బిసి సంక్షేమ సంఘం నాయకులు అచ్చి.వైష్ణవిని, మెమొంటో, శాలువాతో సత్కరరించి రూ 5016 /- రూపాయల నగదు బహుమతి అందించారు. బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు వూకోటి లక్ష్మీనారాయణ మాట్లాడారు. బీసీ సంఘ ఉపాధ్యక్షుడు తుమ్మల శ్రీనివాసులు, పముజుల శంకరయ్య ,తుమ్మల ప్రసాద్,వేమయ్య ,వార్డెన్ లక్ష్మయ్య,చొప్ప వెంకటే శ్వర్లు, కోవూరు వెంకటేశ్వర్లు ,మాడారాధాకష్ణ పి సుధాకర్ ఉన్నారు.



'పది' ఉత్తీర్ణత శాతంపై అసంతృప్తి

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య గ్రూపుల కారణంగా ఆ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు భవిష్యత్తు ప్రమాదంలో పడిందని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దామా కష్ణయ్య ఆరోపించారు. ఆయన ఆదివారం ఇక్కడ మాట్లాడారు. స్థానిక గుడ్లూరు హైస్కూల్లో 81 మంది విద్యార్థులు 10 పరీక్షలు రాయగా అందులో కేవలం 24 మందే సాధారణ మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు. కాగా మిగిలిన 57 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఇక్కడ ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న గ్రూపు పోరు సమస్యను పరిష్కరించాలన్నారు. గుడ్లూరు హైస్కూల్ ఉపాధ్యాయుల పనితీరుపై ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థుల అభివృద్ధికి దోహదపడాలని ఆయన అధికారులను విజ్ఞప్తి చేశారు.



భవన నిర్మాణ కార్మిక సంఘం

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -నెల్లూరు రూరల్

స్థానిక 32వ డివిజన్ పరిధిలోని డైకాస్ రోడ్డు సెంటర్లో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు గా ఎస్ కె ఖాజవల్లి, ఎస్ కె అప్సర్ ఎన్నికయ్యారు. రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిఐటియు రూరల్ నాయకులు బత్తల కిష్టయ్య పాల్గొన్నారు

వడదెబ్బకు వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-గుడ్లూరు

గత రెండు రోజులుగా ఎండలు తీవ్ర రూపం దాల్చి వేడి గాలులు వీయడంతో గుడ్లూరుకు చెందిన పోలినేని వెంకయ్య (80) మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎండల ధాటికి సోమసిలిన వద్దుడికి ప్రాథ మిక చికిత్స చేయించినా ఫలితం లేదని తెలిపారు.



ఘనంగా బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -పొదలకూరు :పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రథమ బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన ఆదివారం సూర్యప్రభ వాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. సూర్యప్రభవాహనంపై స్వామివారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. సూర్యప్రభ వాహనంలో నాలుగు మాడ వీధుల్లో విహరించిన శ్రీవారికి అడుగడుగునా భక్తులు కర్పూరహారతలుపట్టారు. ఉదయకర్తలుగా డాక్టర్ మెంటా. సుధీర్ కుమార్, డా.వెంకట సాయి స్పందన,తన్నీరు చలపతి, సునీతాలక్ష్మీ వ్యవహరించారు అన్నదానం చేశారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతైన ఓ యువకుడి ప్రాణాలను పోలీసులు సాహసం చేసి కాపాడారు. ఈ ఘటన మండలంలోని కోడూరు సముద్ర తీరంలో ఆదివారం జరిగింది. బుచ్చిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన మల్లి నాగేంద్ర అనే యువకుడు తన స్నేహితులతో కలసి సరదాగా గడిపేందుకు కోడూరు బీచ్ కు వచ్చాడు. సముద్రంలో మునుగుతున్న సమయంలో భారీ అ లల తాకిడికి నాగేంద్ర గల్లంతయ్యాడు. దీంతో అతని స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో విధి నిర్వహణలో వున్న మెరైన్ పోలీసులతో పాటు తోటపల్లి గూడూరు కానిస్టేబుల్ శివప్రసాద్, హెూంగార్డ్ నక్కా శ్రీనివాసులు సాహసం చేసి స ముద్రంలో కొట్టుకొని పోతున్న నాగేంద్రను కాపాడారు. ప్రథమ చికిత్స ద్వారా శ్వాస అందించి ప్రాణాలు కాపాడారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. యువకుడి ప్రా ణాలను కాపాడిన పోలీసుల ను కష్ణపట్నం సీఐ కె. వేమారె డ్డి, ఎస్ఐ కె. ఇంద్రసేనా రెడ్డి అభినందించారు.





ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డిని కలిసిన నాయకులు

రామనారాయణరెడ్డికి వినతి

ప్రజాశక్తి -నెల్లూరు రూరల్

ఎపిజెఎసి అమరావతి మూడో దశ ఉద్యమ కార్యచరణలో భాగంగా సమస్యలు ప్రభుత్వానికి చెబుదాం కార్యక్రమాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆదివారం మాజీ మంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డిని ఎపి జెఎసి అమరావతి జిల్లా శాఖ వినతిపత్రం అందజేసింది. ఎపి జెఎసి అమరావతి జిల్లా శాఖ అసోసియేట్ చైర్మన్ ఈవీఎం శరత్ బాబు ఆధ్వర్యంలో సంతపేటలోని ఆనం నివాసంలో ఆయనను కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. శరత్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరి స్తుందని 70 రోజులుగా ఉద్యమం చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. అమరావతి జేఏసీ నెల్లూరు జిల్లా టీం సభ్యులు మురళీకష్ణ బాబురావు సుబ్రహ్మణ్యం చిన్నయ్య చైతన్య కిషోర్ శ్రీకాంత్ సురేష్ బాబు ఉన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలు

కందుకూరు :స్థానిక పెద్ద బజారులో ఉన్న కోదండ రామాలయంలో ఉన్న శ్రీ ప్రసన్నాం జనేయ స్వామికి హనుమజ్జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు రామ చంద్రాచార్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైసిపి పతనం ఖాయం : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు

ప్రజలను సైకోలా పట్టిపీడిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఇంటి దారి చూపిస్తామని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా, కందుకూరు మండలంలోని కొండముడుసు పాలెం గ్రామంలో పార్టీ నేతలతో కలిసి ఆదివారం సాయంత్రం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని ప్రజలు నమ్మి ఓటేస్తే, అన్ని వర్గాల ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాడని విమర్శించారు.కొండ ముడుసు పాలెం చెరువు విషయంలో వైసిపి నేతలు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఎంఎల్ఎ ముఖ్య అనుచరులుగా చెప్పుకుంటున్న నేతలే ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. పలువురు గ్రామస్తులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నాగేశ్వరరావు గారి దష్టికి తీసుకువచ్చారు. ఈసారి రాబోయేది కచ్చితంగా టిడిపి ప్రభుత్వమేనని, అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తారని నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు మాదాల రవికుమార్, సర్పంచ్ తుమ్మా కోటేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ తోకల కోటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ గొంది నర్సింగరావు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పొడపాటి మహేష్, పార్టీ నాయకులు కుక్కపల్లి రాములు, మాదాల గోవర్ధన్, పొడపాటి నరసింహారావు, ఇంటూరి శంకర్, సాదినేని సింగారావు, ఇంటూరి మోహన్, గొంది మాల్యాద్రి, కలవకూరి మాల్యాద్రి, కలవకూరి మాలకొండయ్య, బొద్దులూరి గంగారావు ఉన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఇంటూరి నాగేశ్వరరావు



రాజేష్ జన్మదిన సందర్భంగా రోగులకు పండ్లు పంపీణి చేస్తున్న దృశ్యం

తోపుడు బండి పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు

మండలంలోని మోచర్ల పంచా యతీలోని తెట్టుకు చెందిన టిడిపి కార్యకర్త షేక్ ఖాజారహంతుల్లాకు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం తోపుడు బండి అందజేశారు. చిరు వ్యాపారం చేసుకుంటున్న తనకు తోపుడుబండి ఎంతో ఆసరాగా నిలుస్తుం దన్న షేక్ ఖాజారహంతుల్లా, తనకు సాయం చేసిన నాగేశ్వరరావుకి కతజ్ఞతలు తెలిపారు. తెట్టు గ్రామ పార్టీ నాయకులు షేక్ పెదబాబు, రహం తుల్లా, మాబాషా, సున్నా, షరీఫ్, సుల్తాన్ బాషా, మజహర్, వెంకటేశ్వర్లు, కందుకూరు పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం ఉన్నారు.



ఇంటూరి రాజేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కందుకూరు

టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ జన్మదిన వేడుకలు ఆదివారం పామూరు రోడ్డులోని టిడిపి కార్యా లయంలో అమానులు, కార్యకర్తలు, నాయకుల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా బాణ సంచా కాల్చి వేడుకలు నిర్వహించారు. నియోజ కవర్గం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తల కేరింత నడుమ వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి నలుగురికీ పంచారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభా కాంక్షలు తెలుపుతూ ప్రసం గించారు. అన్నదానం జరిగింది. కోవూరు రోడ్డులో మానసిక వికలాంగుల స్కూల్లో రాజేష్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, ఫ్రూట్స్ పంపిణీ చేసి అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఫ్రూట్స్ పంపిణీ చేశారు. రాజేష్ సోదరుడు రమేష్ ఉన్నారు.



రాజేష్ జన్మదిన వేడుకలలో పాల్గొన్న టిడిపి నాయకులు


ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

అల్లూరులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రం స్థానిక సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరములు, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు అన్వేష్ గట్టు మాట్లాడుతూ తేజ క్లినిక్ నిర్వహకులు డాక్టర్ అభిషై సహకారంతో అలాగే దీప్తి హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. నెలకు 2 దఫాలు ప్రతి మండలంలో ఉచిత సేవలు అందించి మందులను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం నాగులవరం వాసులు కాండ్ర గంగినాయుడు కుమారుడు కాండ్ర సతీష్ మండలంలో ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రానికి రూ.15వేల విలువ చేసే నిత్యావసర వస్తువులు కావలి లోక్ అదాలత్ కమిటీ మెంబరు మాలకొండారెడ్డి వితరణ చేశారు. ఈ సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ సతీష్ నాయుడు ఇలాంటి అనాథలను గుర్తించి వారికి సహాయం అందజేయటం ప్రశంసనీయమన్నారు. రెండు సంవత్సరాల కాలంగా ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా అందజేయడం సామాన్యమైన విసయంకాదని సతీష్ నాయుడు లాంటి వారు సమాజానికి అవసరమన్నారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ అందిస్తున్న సహాయం ప్రశంసనీయమని, సతీష్ ప్రతినెలా 1వ తేదీ తాము అడుగకుండానే సహాయం చేసే వ్యక్తికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన జాగృతి వేదిక ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి, పీట్ల ప్రత్యూష్, తదితరులు పోల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉదయగిరి



నారా లోకేష్ యువగళం పాదయాత్రకు సంఘీభావంగా మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు చేపట్టే సంఘీభావ పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వింజమూరు పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు పాదయాత్ర ను చేపట్టనున్నారని ఈ పాదయాత్ర సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఎస్వి కన్వెన్షన్ హాల్లో ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చెంచలబాబు యాదవ్ పాల్గొంటారని మండల నాయకులు, కార్యకర్తలు, మండల పార్టీ, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.



పలుచోట్ల హనుమాన్ జయంతి

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలం చుంచులూరు, మర్రిపాడులలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానాల వద్ద హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చుంచులూరులో కంటే వెంకటేశ్వర్లు శోభారాణి, మర్రిపాడులో మేదరమెట్ల ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు స్వీకరించారు.

ప్రజాశక్తి-సంగం : మండల కేంద్రంలోని స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని జంగాలదొరువు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేకంగా హోమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు మండలంలోని వరికుంటపాడు, రామపురం, తూర్పు బోయమడుగుల, విరువూరు, ఆలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, ఆకు పూజలు, వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోత్రనామాలతో ఆలయ అర్చకులతో పూజ చేయించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల వద్ద భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

గుంతలమయంగా రోడ్డు


ప్రజాశక్తి-నెల్లూరురూరల్

నెల్లూరురూరల్ మండలంలోని ములుమూడి నుంచి పాతవెల్లంటి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండి, ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నా.. పట్టించుకునే వారే లేరని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని రోడ్డు వేయాలని కోరుతున్నారు.

'కెజిబివి'లో ఉన్నత విద్యే లక్ష్యం

సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉషారాణి

ముఖాముఖి



ప్రజాశక్తి-నెల్లూరు

కార్పరేట్ స్కూళ్లకు ధీటుగా కెజిబివి పాఠశాలలు ఉన్నాయనిసమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉషారాణి పేర్కొన్నారు. బలహీన వర్గాల కోసం, ఆర్థికంగా, సామాజికంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన బాలికలకు విద్యాసౌకర్యం కల్పించేందుకు 2004లో రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలు, (కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, కెజిబివి) ఏర్పాటు చేసింది. జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో బాలికల అక్షరాస్యత తక్కువగా ఉన్న మండలాల్లో కెజిబివి పాఠశాలలు స్థాపించి విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ పాఠశాల స్థితిగతులు ఎలా ఉన్నాయో ఆమె మాటల్లోనే...

ప్రశ్న. ఈ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశానికి ఎంతమంది విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉంది. ప్రవేశానికి ఎవరెవరికి ప్రధాన్యత ఇస్తారు..? విద్యాబోధన, పరిపాలన పరమైన వ్యవహారాలు చేసేవారందరూ మహిళలేనా.. పురుషులు కూడా ఉన్నారా..?

జవాబు. అనాథ వీధి బాలికలు, పేద పిల్లలతో పాటు, బడిబయటి పిల్లలు, బడి మానేసిన వారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, దారిద్ర్య రేఖకు దిగువునున్న బాలికలకు తొలి ప్రాధాన్యం కింద ప్రవేశాలు కల్పిస్తాం. అదేవిధంగా వలస కూలీల చిన్నారులు కార్మిక శాఖ అధికారులు సిఫారసు చేసిన వారికి ప్రవేశాలలో ప్రాధాన్యత ఉంటుంది. నాణ్యమైన విద్య ప్రశాంత వాతావరణం వుండి బాలికలకు మాత్రమే ప్రత్యేకంగా ఉన్న ఈ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం పాఠశాల, జూనియర్ కాలేజీలు 2023–24 విద్యాసంవత్సరానికి గానూ 6, 11 తరగతిలో ప్రవేశాలకు జిల్లా విద్యాశాఖ అధికారణి ఆర్‌ఎస్ గంగాభవాని అనుమతితో ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించాం. 6వ తరగతి ప్రవేశానికి 40మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. ఇంటర్ విద్య ప్రవేశానికి 40మంది విద్యార్థుల ప్రవేశానికి అనుమతి ఉంటుంది. ఇంటర్మీడి యట్‌లో కావలి, సీతారామపురం, కొండాపురం, ఉలవపాడు, వలేటి వారిపాలెంలో ఎంపిసి గ్రూపు, నందిపాడు, అనుమసముద్రం పేటలో బైపిసి గ్రూపు, గుడ్లూరు, లింగసముద్రం నందు హెచ్‌సి గ్రూప్, మర్రిపాడులో అకౌంట్స్ అండ్ టాక్సేషన్, కలిగిరి నందు నర్సింగ్ కోర్సు (ఎంపిహెచ్‌డబ్ల్యూ) కందుకూరులో డైరీ సైన్స్ అనే ప్రత్యేక కోర్సులు కలవు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థి ఏప్రిల్ 20వ తేదీలోగా వెబ్‌సైట్‌లో ఆధార్ కార్డ్, పాస్ ఫొటో, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. సందేహాల కోసం జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ చరవాణి 9908837107 లేదా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ 9849909132 నందు సంప్రదించవచ్చు.

ప్రశ్న. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందుబాటులో ఉందా.. క్రీడల్లో ప్రొత్సాహం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. ఆంగ్ల మాధ్యమంలో విద్య, పుస్తకాలు, మూడు పూటలా భోజనం ఆరోగ్యకరమైన భోజనం, యూనిఫారం, బూట్లు, సాయంత్రం వేళల్లో స్నాక్స్, పాలు అన్ని ఉచితంగా అందిస్తూ కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్, యోగ, కంప్యూటర్ శిక్షణ, డ్యాన్స్, చిత్రలేఖనం, క్రీడలు లాంటి విద్యార్థులకు ఉపయోగపడే అంశాల పట్ల ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. దీనికి ఉదాహరణ జిల్లాలో కలిగిరి కెజిబివిలో రోప్ జంప్ క్రీడల్లో శిక్షణ పొందిన చిట్టేటి సుష్మి అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని రజిత పతకం సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టింది. నూతనంగా జిల్లా గర్ల్స్ చైల్డ్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్న మమతా ఆధ్వర్యంలో ప్రతిరోజు పిల్లల ఆరోగ్యం చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు టిఫిన్, భోజనాలు మొదలగు ఏర్పాట్లు పక్కాగా ఉండేటట్లుగా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా ప్రత్యేక శ్రద్ధ వహించడం వల్ల గత సంవత్సరం కెజిబివిలో మంచి ఫలితాలు సాధించి కలెక్టర్ చేతి మీద చేతుల మీదుగా ప్రశంసలు కూడా పొందారు.

ప్రశ్న. జిల్లాలో ఏయే మండలాల్లో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశం ఏ విధంగా ఉంటుంది..? ఇంటర్ విద్యాబోధనకు కళాశాలలున్నాయా, ఉంటే ఎంత మంది విద్యార్థులకు ప్రవేశం అవకాశం ఉంది..?

జవాబు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన బాలికలకు విద్యా సౌకర్యాలను అందించడానికి 2004 ఆగస్టు భారత ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలే కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ లేదా కెజిబివిలుగా నామకరణం చేశారు. జిల్లాలో బాలికల అక్షరాస్యత తక్కువగా ఉన్న మండలాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కెజిబివిలు బాలికల విద్యకు భరోసాగా నిలుస్తున్నాయి. లక్షల రూపాయలు తీసుకుని విద్యను అందించే కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా బోధన సాగిస్తున్న కెజిబివి పాఠశాలలకు ప్రతి ఏటా డిమాండ్ పెరుగుతూ ఉంది. జిల్లా వ్యాప్తంగా కావలి, దుత్తలూరు, వాలేటివారిపాళెం, అన్నాసముద్రపేట, కలిగిరి, కందుకూరు, కొండాపురం, లింగసముద్రం, మర్రి పాడు, సీతారామపురం, ఉలవపాడు, గుడ్లూరు, 12 కెజిబివి పాఠశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధన అత్యంత సమర్థవంతమైన క్వాలిఫైడ్ ఉపాధ్యాయురాలచే గుణాత్మక విద్యను అందిస్తున్నాం.


మాట్లాడుతున్న మాలకొండారెడ్డి

మహిళలు ఆర్థిక, సామాజిక ప్రగతిని సాధించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో మహిళలు సాంఘికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెంది మహిళా సాధికారతను సాధించాలని ప్రముఖ సామాజికవేత్త ఎం.మాలకొండా రెడ్డి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో మహిళా సాధికారతపై జరిగిన సదస్సులో మాలకొండారెడ్డి మాట్లాడుతూ వాకలపూడి గ్రామంలో మహిళలు కుట్టు మిషను, ఎంబ్రాయిడింగ్, తదితర రంగాల్లో శిక్షణ పొంది మహిళా పారిశ్రామికంగా ఎదగడానికి ఏర్పాటు చేసిన మహిళా టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా మహిళలు రాజకీయంగా ,సామాజికంగా మరి పారిశ్రామిక రంగాల్లో ఎదుగుతున్న క్రమంలో కుటుంబ సంక్షేమం ఆధారపడి ఉంటుందన్నారు. మహిళ అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, వారిపై ఆధారపడి ఉంటుందన్నారు. మహిళలు వివిధ రంగాల్లో శిక్షణ పొంది అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. వారు పురుషులతో పోటీపడి ఎదిగాలని, కుటుంబ సంక్షేమం, గ్రామీణ అభివృద్ధిలో, వారిపాత్ర ఎనలేనిదని తెలియజేశారు. కార్యక్రమంలో కుట్టు శిక్షణ కేంద్రం అధినేత జి.సరస్వతి, ఆ శిక్షణ కేంద్రాన్ని ప్రోత్సహిస్తున్న పెద్దలు పెంకె నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.


సుబ్బానాయుడును సన్మానిస్తున్న టిడిపి శ్రేణులు

మాలేపాటి సుబ్బానాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కావలి

కావలి టిడిపి కార్యాలయ ప్రాంగణంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు జన్మదిన వేడుకలను టిడిపి శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ట్రంకు రోడ్డులోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి తెలుగుదేశం పార్టీ వర్ధిల్లాలి అనే నినాదాలు చేశారు. భారీ సంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణుల ఆనందోత్సవాల మధ్య సుబ్బానాయుడు 2 భారీ కేకులను కత్తిరించి వచ్చిన వారందరికీ తీపి చేశారు. మాలేపాటి నాయకత్వం వర్ధిల్లాలి అనే నినాదాలతో పార్టీ శ్రేణుల కరతాళ ధ్వనులతో పార్టీ కార్యాలయ ప్రాంగణం మారుమోగింది. అధిక సంఖ్యలో వచ్చిన అభిమానులు ఆయన నిండునూరేళ్లు సుఖ సంతోషాలతో అష్టఐశ్వర్యాలతో వెలుగొందాలని ఆశీర్వదించారు. పూలమాలలతో.. దుశ్శాలువాలతో.. గజమాలతో... కేకులతో... పార్టీ శ్రేణులు పండగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడుతూతాను ఈ స్థాయికి రావడానికి ఎన్‌టిఆర్ కారణమని ఆ తరువాత చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ.. బీద రవిచంద్ర సారథ్యంలో నడవడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి వంశాభిమానులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు జెవివి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 7.00 గంటలకు కావలి పట్టణంలోని రైతు బజార్ "నందు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. కావున కార్యవర్గ సభ్యులు, ప్రజలు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

మురుగునీరు సరఫరా..

- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- అక్కరకు రాని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్


నిరుపయోగంగా వున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్


ఎటి ఎస్ ఛానల్ నుండి వచ్చే ప్రధాన కాలువ

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని నార్త్ ఆములూరు సమీపం లోని ఎటిఎస్ ఛానల్ ద్వారా అల్లూరు చెరువు, మోపూరు మట్టానికి సమృద్ధిగా సాగునీరు సరఫరా అవుతుంది. ఈ ప్రధాన కాలువ చెరువుకి అలాగే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కి అధికంగా నీరు చేరుతుంది. కాగా ఎటిఎస్ ఛానల్ మొదలుకొని రొయ్యల గుంతలు అలాగే ఫంగస్ అనే చేపలను విపరీతంగా సాగు చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం నుండి కోడి వ్యర్థాలను అర్ధరాత్రి వాహనాలలో తీసుకువచ్చి వాటికి ఆహారంగా వేస్తారు. ఈ వ్యర్థాలు తీసుకువచ్చే క్రమంలో విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. సాగుదారులను పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేదని తెలియజేశారు. అంతేకాకుండా ఒరవ కాలువ కలుషితం కారణంగా తీవ్ర ఇక్కట్లు చెందుతున్నామని గ్రామస్తులు వాపోయారు. ఇదిలా ఉండగా ఈ ప్రధాన కాలువ బీరంగుంట, నార్త్ మోపూరు మీదుగా సరాసరి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీరు చేరడంతో వాడిన ప్రజలలు విషజ్వరాల బారిన పడుతున్నారు. సుమారు రెండున్నర సంవత్సరం నుండి ఫిల్టర్లు మార్చకపోవడంతో గుర్రపు డెక్కలో ఉన్న బురద నీరు శుద్ధి కాక రంగు మారి అదోక రకమైన వాసన వస్తుందని తెలియజేస్తున్నారు. స్నానం చేస్తేదద్దులు వస్తున్నాయని వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు చేసేది ఏమీ లేక అవే వాడుతున్నామని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రావడంలేదని పూర్తి సమాచారం. అక్కడ పనిచేసే సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వటం లేదని బోరున విలపించారు. జీతాలు ఇవ్వకపోగా అధికారులు నానా దుర్భాషలాడుతున్నారని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆర్డబ్ల్యూఎస్, నగర పంచాయతీ అధికారుల మొక్కుబడి పర్యవేక్షణ తప్ప ఇంకేమీ లేదని అంటున్నారు. గత్యంతరం లేని పేద ప్రజలు మినరల్ వాటర్‌ను కొనుగోలు చేయలేక ఈ నీటిని సేవించడంతో రోగాల బారిన పడ్డారు. ప్రధానంగా కొన్ని గ్రామాలలో డయేరియా, టైఫాయిడ్, డెంగీ సోకి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. కలుషిత నీరు ప్రభావంతో ప్రజలు వ్యాధుల బారిన పడితే అధికారుల హడావుడి అంతా ఇంతా ఉండదని అంటున్నారు. సమృద్ధిగా తాగునీరును అందించే వ్యవహారంలో అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేక పోతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల వాసులు ఏళ్ల తరబడి గుక్కెడు నీటి కోసం అలమటిస్తుంటే వివిధ పార్టీల పాలకులు మాటలు గారడి తప్పా ఇసుమంతైనా పనిచేయలేదని బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు.

చెరువులో అక్రమంగా మట్టి తరలింపు

ప్రజాశక్తి-అల్లూరు



అల్లూరు చెరువులో పట్టపగలే కొంతమంది మట్టి మాఫియా కేటుగాళ్లు యంత్రాలతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పలుమార్లు హెచ్చరించినా పట్టించు కోకుండా మట్టిని యథేచ్ఛగా తరలించుకు పోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా జెసిబితో చెరువు మట్టిని ట్రాక్టర్లలో తీసుకు వెళుతూ జగనన్న కాలనీల కంటూ బురిడీ కొట్టిస్తున్నారు. గతంలో మండల ప్రజల దాహార్తి కోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సుమారు 150 ఎకరాలను కేటాయించారు. ఇందులో రిజర్వాయర్ ఏర్పాటు చేసి సమృద్ధిగా ప్రజలకు తాగునీరు అందించేందుకు రంగం సిద్ధం చేశారు. గతంలో చెరువులో భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం తరపున నార్త్ ఆములూరు గ్రామంలో భూములు కేటాయించి పట్టాలు మంజూరు చేశారు. నిర్మాణం అనుకున్న రీతిలో జరగకపోవడంతో ఆ భూములపై కొందరు కన్నేసి సాగు చేసుకుంటూ వచ్చారు. ఈ భూముల కోసం అప్పట్లో తీవ్రంగా దాడులు జరుగగా రెవెన్యూ అధికారులు 145 సెక్షన్ అమల్లోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆ సెక్షన్ అమలులో ఉన్నా మట్టి మాఫియా లెక్కచేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు అంటున్నారు.



ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి టౌన్ రామ్మూర్తి పేటకు చెందినజగదీష్ అను ఆటోడ్రైవర్ ఒకటిన్నర సంవత్సరం వయసు గల కుమారుడికి చెవి దగ్గర గడ్డ వస్తున్నందున, లేజర్ ట్రీట్మెంట్ కోసం మన బెస్ట్ వాకర్స్ తరపున సోమవారం రూ.11500 ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లీకేజీలతో కలుషిత నీరు సరఫరా


- విష జ్వరాలు విజృంభణ
- బ్రిడ్జికి పొంచి ఉన్నముప్పు


లీకేజీతో వ్యర్థంగా మారుతున్న నీరు

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కి వెళ్లే మార్గంలో పైపులైన్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో లీకేజీల కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే నగర పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాలలో కలుషిత నీరు, పారిశుధ్యం లోపించి విష జ్వరాలు విజృంభించడంతో ప్రజలు వ్యాధుల బారిన పడ్డారు. డెంగీతో గతంలో గాలిదిబ్బల గ్రామంలో ఒక మహిళ మరణించడం జరిగింది. చెర్లో సంఘం బ్రిడ్జి వద్ద భారీ లీకేజీతో పెద్ద గోతులు కారణంగా బ్రిడ్జిపై నీరు నిలిచిపోవడంతో ముప్పు పొంచి ఉందని పాదచారులు అంటున్నారు. గ్రద్ద గుంట, బట్ర కాగోల్లు ప్రాంత ప్రజలు నిత్యం వాహనాలలో సంచరిస్తూ ఉండగా గోతుల్లో పడి స్వల్ప గాయాలతో బయటపడ్డామని తెలిపారు. లీకేజీలను అరికట్టి గోతులను పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా చెరువుకు వెళ్లే కాలువకు రక్షణ గోడ లేనందున అందులో పడితే మా పరిస్థితి ఏమిటని అంటున్నారు. లీకేజీలను అదుపు చేయలేని దుస్థితిలో నగర పంచాయతీ ఉందని స్థానికులు తెలుపుతున్నారు. ఇకనైనా ఈ లీకేజీలను అరికట్టాలని నగర పంచాయతీ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ, ఎంపి


ఉత్సవాల్లో పాల్గొన్న కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి, ఎంపి బీద

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని ఇస్కపల్లి పాలెం, చంద్రబాబు నగర్‌లో శనివారం రాత్రి గ్రామస్తులు అంగరంగ వైభవంగా శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్‌రావు యాదవ్ పాల్గొని ఉత్సవాలను ఆసక్తిగా తిలకించి సరదాగా గ్రామస్తులతో గడిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని తెలిపారు. వారి అభివృద్ధికి వెన్నంటి ఉంటామని హామీనిచ్చారు. అనంతరం ఇంటర్లో నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే గణేష్ నృత్యం చేసిన విశాఖపట్నం టీముకి రూ.10వేలు అందించారు. కావలి మాజీ ఎఎంసి చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, ఎఎంసి వైస్‌ప్రెసిడెంట్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, జెడ్‌పిటిసి సభ్యురాలు చలంచర్ల వేణమ్మ, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, బీద రమేష్ యాదవ్, కొండూరు శ్రీనివాసులు తదితరులున్నారు.